## లక్ష్మీ నరసింహుడికి ఏపీ హైకోర్టు న్యాయమూర్తి పూజలు



న్యాయమూర్తికి వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 7 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. యాదగిరిగుట్టకు చేరుకున్న ఆమెకు ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి తాసీల్దార్ దేశ్యా పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ప్రధానాలయంలోకి వెళ్లి స్వయంభూ పంచనారసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు వారికి సంప్రదాయ స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందించారు.

# రేవంత్ నోట.. నిధుల మాటేది?

## కొత్తగా ఒక్క పథకంపైనా ప్రకటన లేదు

- మంత్రి కోమటిరెడ్డి అడిగిన డెంటల్ కాలేజీపైనా దాటవేత
- బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుకు నిధుల ఊసేలేదు
- మిగిలిన పనులకూ నిధులు ఇవ్వకపోవడంతో నిరుత్సాహపడ్డ జనం
- బీఆర్ఎస్ సర్కారులో చేపట్టిన పనుల ప్రారంభానికే పరిమితమైన రేవంత్‌రెడ్డి
- ఏడాది పాలన విజయోత్సవ సభపై నీరుగారిన ప్రజల ఆశలు
- సీఎం సభకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి డుమ్మా

### జిల్లా ప్రజలను నిరుత్సాహపర్చిన సీఎం పర్యటన

అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవ సభ ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలను తీవ్ర నిరుత్సాహానికి గురి చేసింది. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి, అదీ ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా రేవంత్‌రెడ్డి నల్లగొండకు వస్తుండడంపై జిల్లా ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. మిగిలి ఉన్న అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల మంజూరుతో పాటు కొత్త ప్రాజెక్టులు, పనులకు వరాలు కురిపిస్తారని ఆశించారు. కానీ అలాంటి వాటికి రేవంత్‌రెడ్డి ప్రసంగంలో చోటు దక్కలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై అడ్డదిడ్డమైన ఆరోపణలతోపాటు కేసీఆర్‌పై ఎప్పటిలాగే వ్యాఖ్యలతో రేవంత్ ప్రసంగం సాగింది. ఇక ప్రజలు వద్దంటున్న ఫ్యూచర్ సిటీని 50వేల ఎకరాల్లో నిర్మించి తీరుతామని, ఎవరు అడ్డొచ్చినా మూసీ ప్రక్షాళన ఆగదని, ట్రిపుల్ ఆర్‌ను ఇప్పటిలాగే నిర్మించి తీరుతామని శపథం చేశారు. ఏదైనా కొత్తగా చేపట్టాలి అంటే ఏదో ఒకటి, ఎవరో ఒకరు కోల్పోక తప్పదంటూ బలవంతపు భూ సేకరణను, ప్రస్తుత అలైన్‌మెంట్‌ను వ్యతిరేకిస్తున్న ప్రజలకు పరోక్ష హెచ్చరికలు సైతం చేయడం గమనార్హం.

– నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ)





బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల పథకం పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ జిల్లా పరిధిలో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహా, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి రేవంత్ పర్యటన కొనసాగింది. ముందుగా బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల పథకం పైలాన్‌ను ఆవిష్కరించి రిజర్వాయర్ వద్ద గంగా హారతి ఇచ్చి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అక్కడి నుంచి దామరచర్ల మండలం వీర్లపాలెంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులో రెండో యూనిట్ ద్వారా 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టి జాతికి అంకితం చేశారు. ఆ తర్వాత చివరగా నల్లగొండ మెడికల్ కాలేజీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఏడాది పాలన విజయోత్సవ సభలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం సీఎం ప్రసంగించారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి రేవంత్‌రెడ్డి నల్లగొండ గడ్డపై అడుగు పెట్టడంతో భారీగా వరాలు ప్రకటిస్తారని అందరూ ఆశించారు. శనివారం ప్రారంభించిన అన్ని పనులు కూడా కేసీఆర్ హయాంలో చేపట్టినవే. చివరి దశలో ఉన్న వాటికి తుది మెరుగులు దిద్ది కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ప్రారంభించిన విషయం తెలిసిందే. దాంతో కాంగ్రెస్ ప్రభుత్వం మార్క్ ఉండేలా సీఎం రేవంత్‌రెడ్డి కొత్తగా వరాలు ప్రకటిస్తారని ఆశించగా నిరాశే మిగిలింది.. బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులో ఇంకా కీలకమైన భూ సేకరణ మిగిలే ఉంది. ఇది పూర్తయితేనే ఎడమ, కుడి కాల్వలతోపాటు డిస్ట్రిబ్యూటరీ కాల్వలు తవ్వాల్సి ఉంటుంది. దీని కోసం కనీసం రూ.300 కోట్లు అవసరం అవుతాయని అధికారుల అంచనా. ఇవ్వాల అసంపూర్తి ప్రాజెక్టును ప్రారంభిస్తున్న సందర్భంగా మిగతా పనుల కోసం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేస్తారని ప్రజలు భావించారు. కానీ ఒక్క పైసా కూడా దాని కోసం ప్రత్యేకంగా రేవంరెడ్డి ప్రకటించ లేదు. తక్షణం అవసరం ఉన్న రూ.72కోట్ల నిధుల ఊసు కూడా లేదు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన ఒక్క ప్రకటన కూడా సీఎం నోటా రాలేదు. నల్లగొండ మెడికల్ కాలేజీకి అనుబంధంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం జరగాల్సి ఉంది. దీనిపైనా రేవంత్‌రెడ్డి ప్రకటన చేస్తారని ఆశించగా నిరాశే మిగిలింది. జిల్లాలో ఇంకా రెండు లక్షల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నట్లు అంచనా. దీనిపైన సీఎం మాట్లాడుతున్నారని అనుకున్నా ఆ ప్రస్తావనే లేదు. ఆ ముచ్చట తీసుకురాండా ఇప్పటికే నల్లగొండ జిల్లాకు రూ.2,004 కోట్ల లబ్ధి జరిగిందంటూ గొప్పలు చెప్పబోయారు. రైతు భరోసా మాత్రం సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పడం ఒక్కటే ఊరట కలిగించేదిగా ఉంది. అది కూడా పెండింగ్‌లో ఉన్న వానకాలం రైతుభరోసానా, ప్రస్తుత యాసంగికి సంబంధించినదా అనేది స్పష్టం చేయలేదు.

### మంత్రి కోమటిరెడ్డి అడిగినా..

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండకు డెంటల్ కాలేజీ మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అయినా దీనిపై రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలో దాటవేత వైఖరిని కనబర్చారు. కోమటిరెడ్డి ఏవోవే రాసిస్తూ తనకు పేపర్లు ఇస్తున్నారంటూ ప్రస్తావించారు. కానీ అవి ఏంటో చెప్పలేదు. వాటికి నిధులు ఇస్తున్నట్లు కూడా ప్రకటించపోవడం విస్మయం కలిగించింది. ఇక వాటితోపాటు జిల్లాలోని పలు పెండింగ్ పనులపైనా ప్రజాప్రతినిధులు ఆశలు పెట్టుకున్నారు. వాటిల్లో వేటికీ కొత్తగా రేవంత్‌రెడ్డి నోట నిధుల ప్రస్తావన రాలేదు. ఇదే సమయంలో ప్రజలు డిమాండ్ చేస్తున్న ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పుతోపాటు మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం చెల్లింపుల పైనా ప్రస్తావన లేదు. ఎప్పటిలాగే అడ్డదిడ్డమైన మూసీ ప్రక్షాళన చేసి తీరానని, అక్కర లేని ఫ్యూచర్ సిటీని 50వేల ఎకరాల్లో నిర్మించి తీరుతానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

### రాజగోపాల్‌రెడ్డి డుమ్మా

సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కీలక మంత్రులంతా హాజరైన నల్లగొండలోని బహిరంగ సభకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి డుమ్మా కొట్టారు. కేవలం బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు వద్ద జరిగిన పూజా కార్యక్రమానికే రాజగోపాల్‌రెడ్డి పరిమితమయ్యారు. వాస్తవంగా దానికి కూడా రాజగోపాల్‌రెడ్డి వస్తారా, లేదా అన్న సంశయం కొనసాగింది. తన స్వగ్రామం అవడం, తమ ప్రాంత ప్రయోజనాలతో కూడుకున్న ప్రాజెక్టు అవడంతో దీనికి మాత్రమే హాజరై వెళ్లిపోయనట్లు తెలిసింది. నల్లగొండలో మెడికల్ కాలేజీ ఓపెనింగ్‌కు గానీ, బహిరంగ సభకు గానీ ఆయన రాలేదు. మునుగోడు నియోజకవర్గం నుంచి కూడా సీఎం సభకు పెద్దగా జన సమీకరణ చేయలేదు. వెళ్లే వాళ్లను వద్దన లేదు.. కావాలని పట్టుబట్టి ఎవరినీ పొమ్మని చెప్పలేదని తెలిసింది. తనకు మంత్రి పదవిపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ పార్టీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆగ్రహంతో రాజగోపాల్‌రెడ్డి ఉన్నట్లు సమాచారం. రాజగోపాల్‌రెడ్డి వ్యవహారం రానున్న కాలంలో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనన్న ఆసక్తి కాంగ్రెస్ వర్గాల్లో నెలకొంది.



మాజీ మంత్రి హరీశ్‌రావుకు వినతి పత్రం ఇస్తున్న ట్రిపుల్ ఆర్ బాధితులు

## ట్రిపుల్ ఆర్ బాధితుల పక్షాన పోరాటం

- మాజీ మంత్రి హరీశ్‌రావు భరోసా

చౌటుప్పల్, డిసెంబర్ 7 : చౌటుప్పల్ రీజినల్ రింగ్ రోడ్డు బాధితులు శనివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి భువనగిరి సభలో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారుస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే మాట తప్పారని పేర్కొన్నారు. ఇప్పుడు తమ బాధను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా భూసేకరణ చేస్తున్నారని, భూ సేకరణ పత్రాలపై బలవంతంగా అధికారులు సంతకాలు సేకరిస్తున్నారని తెలిపారు. బహిరంగా మార్కెట్ ధరకు కాకుండా తక్కువకు భూములు లాక్కుంటున్నారని వాపోయారు. ఎక్కడా భూసేకరణ చట్టం అమలు చేయడం లేదన్నారు. మిగతా ప్రాంతాల్లో ఓఆర్ఆర్ నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో భూములు తీసుకొని, ఉత్తర భాగంలో మాత్రం 28 కిలోమీటర్లకు పరిమితం చేశారని వివరించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. గతంలో చౌటుప్పల్ జంక్షన్‌కు 78 ఎకరాలు ప్రతిపాదించగా, ఇప్పుడు 184 ఎకరాలు పెంచారంటూ ఆయా సమస్యలపై హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

ఆయన స్పందిస్తూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల్లో బాధితుల పక్షాన పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. హరీశ్‌రావును కలిసిన వారిలో ట్రిపుల్ ఆర్ బాధితుల సంఘం కన్వీనర్ చింతల దామోదర్ రెడ్డి, నాయకులు, రైతులు పెద్దిటి బుచ్చిరెడ్డి, బోరం ప్రకాశ్ రెడ్డి, సందగళ్ల మల్లేశ్ గౌడ్, జాల వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవితను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు

## ఎమ్మెల్సీ కవితను కలిసిన ఎరుకల సంఘం నేతలు

- సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 7 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లోని కార్యాలయంలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాసన మండలిలో ఎరుకల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని కోరారు. హైదరాబాద్ నిజాంపేటలో ఎరుకల ఆత్మగౌరవ భవనం పూర్తి, ఎరుకల కుటుంబాలకు ఎరుకల ఎంపవర్‌మెంట్ స్కీమ్, చేవెళ్ల ఎస్టీ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ ప్రకటించిన ప్రకారం ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్ల బడ్జెట్‌ను కేటాయింపు, భూదాన్ పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలో జరిగే ఎరుకల నాంచారమ్మ జాతరకు రూ.10 లక్షల బడ్జెట్ కేటాయించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూతడి రవికుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కోనేటి నర్సింహా, రాష్ట్ర కోశాధికారి వనం రమేష్, జిల్లా అధ్యక్షుడు కూతడి సురేశ్, నాయకులు రాజశేఖర్, యాదగిరి పాల్గొన్నారు.



తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

## సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట (దేవరకొండ), డిసెంబర్ 07 : తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. దేవరకొండ బస్టాండ్ ఆవరణలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో శనివారం ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు 12 నెలల జీతాలు చెల్లించాలని, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావిస్తారని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు, నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, రమావత్ రమేశ్‌నాయక్, జానీబాబా, ఇలియాస్ పటేల్, వడ్త్యా బాలు, తరి గోవర్ధన్, నజీర్, మధు, బాబా, శ్రీను, శ్రీరాములు, రవి, చారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## సీఎం సభకు స్కూల్ బస్సులు

- కచ్చితంగా పంపించాలని జిల్లా అధికారుల ఆదేశం
- బడులకు సెలవు ఇచ్చి మరీ బస్సులను పంపిన యాజమాన్యాలు
- తల్లిదండ్రుల ఆగ్రహం





నకిరేకల్ నుంచి సీఎం సభకు వెళ్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు

రామగిరి, డిసెంబర్ 7 : విద్యకు పెద్ద పీట వేస్తామంటూ ఊదరగొట్టే కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న చదువులను సైతం నీరుగారుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి సభ నేపథ్యంలో జన సమీకరణ రవాణా కోసం అధికారులు ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలపై ప్రతాపం చూపారు. అన్ని స్కూళ్లు బస్సులు పంపాలని హుకూం జారీ చేయడంతో శనివారం నల్లగొండ జిల్లావ్యాప్తంగా పాఠశాలలు అన్నింటికీ సెలవు ప్రకటించారు. మొదట డీజిల్, డ్రైవర్‌కు బత్తా ఇస్తామని చెప్పినా. ఆఖరికి అవి కూడా ఇవ్వలేదని ఓ స్కూల్ యజమాని వాపోయారు. సీఎం సభకు ప్రైవేట్ పాఠశాలల బస్సులను పంపించాలని జిల్లా అధికారులు, ఆర్టీఏ అధికారులు ఒక్క రోజు ముందే ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఉదయమే బస్సులను అధికారులు సూచించిన ప్రాంతాలకు పంపించారు. మిర్యాలగూడ, దేవరకొండ ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకు అక్కడ బస్సులను ఉంచుకుని సరిపడా జనం లేకపోవడంతో కొన్నింటిని వెనక్కి పంపించారు. కాగా, సీఎం సభ కోసమని పాఠశాలలకు సెలవు ఇచ్చి బస్సులను వాడుకోవడమేంటని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.



బస్సులు లేక ఖాళీగా నల్లగొండ బస్టాండ్

## ఆర్టీసీ బస్సులూ అటే..

- బస్టాండ్లలో నిరీక్షించిన ప్రయాణికులు

నల్లగొండ సిటీ డిసెంబరు 7 : సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన ఆర్టీసీ ప్రయాణికులను అవస్థల పాలు చేసింది. అధికారులు అత్యధిక బస్సులను సభ కోసం పంపించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. నల్లగొండ రీజియన్ పరిధిలోని వివిధ రూట్లలో రోజూ 634 బస్సులను నడిపిస్తుంటారు. కాగా, శనివారం సీఎం సభకు జనాన్ని తరలించేందుకు 265 బస్సులను ఆర్టీసీ అధికారులు కేటాయించగా, 369 బస్సులు మాత్రమే ప్రయాణికుల కోసం ఆయా రూట్లలో నడిపారు. కొన్ని రూట్లకు అసలు బస్సులే పంపలేదు. రోజువారీగా నడిచే ట్రిప్పులతో చూస్తే బుధవారం ఒక్క నల్లగొండ రీజియన్ నుంచే 800 ట్రిప్పులు తగ్గాయి. రద్దీ ఎక్కువగా ఉండే హైదరాబాద్, సూర్యాపేట, మిర్యాలగూడ, దేవరకొండ, యాదగిరిగుట్ట, మాచర్ల రూట్లలో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. వచ్చిన కొన్ని బస్సులు కిక్కిరిశాయి. ఇతర జిల్లాల నుంచి మరో 450 బస్సులను సీఎం సభకు రప్పించారు.

**డిపోల వారీగా తరలించిన బస్సులు..**

| | |
|---|---|
| నల్లగొండ | 60 |
| దేవరకొండ | 60 |
| మిర్యాలగూడ | 36 |
| యాదగిరిగుట్ట | 30 |
| కోదాడ | 35 |
| సూర్యాపేట | 44 |

## నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి





లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి వస్తున్న పర్యాటకులు

నందికొండ, డిసెంబర్ 7 : నాగార్జునసాగర్‌లో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. రాష్ట్ర టూరిజంశాఖ ఏర్పాటు చేసిన లాంచీలో నాగార్జునకొండకు, కృష్ణానదిలో జాలీ ట్రిప్పునకు వెళ్లేందుకు పోటీ పడ్డారు. నాగార్జునసాగర్ డ్యాం, లాంచీ స్టేషన్, బుద్ధవనం పరిసరాలు పర్యాటకులతో కిటకిటలాడాయి.

## బీఆర్ఎస్ నేతలపై పోలీసుల దమనకాండ

- శుక్రవారం అర్ధరాత్రి నుంచే అక్రమ అరెస్టులు
- మాజీ ఎమ్మెల్యేల గృహ నిర్బంధం.. ఎక్కడికక్కడ బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి..
- సర్కారు తీరుపై మండిపడిన మాజీ ఎంఎల్ఏ కంచర్ల

నీలగిరి, డిసెంబర్ 7 : నల్లగొండ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పోలీస్ యంత్రాంగం బీఆర్ఎస్ నాయకులపై దమనకాండ సాగించింది. బీఆర్ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ మంజూరు చేసిన నిధులతో చేపట్టిన నిర్మాణాల ప్రారంభోత్సవానికి వస్తున్న సందర్భంగా బీఆర్ఎస్ ఉనికి లేకుండా ఉండేందుకు వచ్చిన ఆదేశాల మేరకు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను శుక్రవారం అర్ధరాత్రి నుంచే అక్రమంగా అరెస్ట్ చేశారు. గ్రామస్థాయి కార్యకర్త నుంచి మాజీ ఎమ్మెల్యేల వరకు అందరినీ అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన నాయకులను స్థానిక పోలీస్ స్టేషన్లలో కాకుండా ఇతర స్టేషన్లకు తరలించారు. మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నల్లబోతు భాస్కర్‌రావు, జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, ఐసీడీఎస్ మాజీ ఆర్ఓ మాలె శరణ్యారెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల ఇంటి వద్ద 20మందికిపైగా పోలీసులు పహారా కాశారు. గురువారం మెడికల్ కళాశాల వద్ద కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసిన నాయకులను అదుపులోకి తీసుకుని విడుదల చేయలేదు. నల్లగొండలో మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కనగల్ మాజీ ఎంపీపీ కరీంపాషా, తిప్పర్తి మాజీ జడ్పీటీసీ తండు సైదులు గౌడ్ తోపాటు పలు మండలాల అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ముఖ్యనాయకులను అరెస్టు చేశారు.

### ట్రాఫిక్ మళ్లింపుతో ఇబ్బందులు..

సీఎం పర్యటన సందర్భంగా జిల్లాలో పోలీసులు దేవరకొండ, నాగార్జునసాగర్ వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. దేవరకొండ రోడ్డులోని అక్కలాయిగూడెం, రూరల్ పోలీస్ స్టేషన్ క్రాస్‌రోడ్డు, ఎస్ఎల్‌బీసీ క్రాస్ రోడ్డుల వద్ద బారికేడ్లు పెట్టి వాహనాలను మెడికల్ కళాశాల సభ వద్దకు రాకుండా నిలిపివేశారు. సీఎం సభకు మండల సూపర్‌వైజరీ అధికారులను ఏర్పాటు చేసి జనాన్ని తరలించారు. వారి వాహనాలను అయ్యప్ప గుడి వద్దే నిలిపివేశారు. కొన్నింటికి డాన్‌బస్కో స్కూల్‌లో పార్కింగ్ ఇచ్చారు. మిగతా వాహనాలను దానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేశారు. అధికారులు, వీఐపీల వాహనాలకు బత్తాయి మార్కెట్‌లో పార్కింగ్ ఇచ్చారు. దాంతో సభా స్థలానికి రెండు కిలో మీటర్ల దూరం నడవాల్సి వచ్చింది. కాంగ్రెస్ నేతలు గ్రామాల నుంచి వృద్ధులను సైతం తీసుకరావడంతో వారు నడువలేక ఇబ్బందులు పడ్డారు.





నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతల నిరసన

### సీఎంతో ముఖాముఖికి కొందరు విద్యార్థులే..

మెడికల్ కళాశాల ప్రారంభోత్సవం సందర్భంగా వైద్య విద్యార్థులతో సీఎం ముఖాముఖి ఏర్పాటు చేశారు. దాంతో విద్యార్థులు తమ సమస్యలు చెప్పొచ్చని భావించారు. కానీ పోలీసులు కేవలం ఎంపిక చేసిన కొద్ది మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. దాంతో మెజారిటీ విద్యార్థులు, సిబ్బంది రోడ్డుపైనే ఉండిపోయారు.

## ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీనే : మాజీ ఎమ్మెల్యే కంచర్ల





విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల

తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తేస్తామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారని, ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ రాజ్యమేనని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి విమర్శించారు. పోలీస్ హౌస్ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలను వేధింపులకు గురిచేస్తూ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తుందని మండిడపడ్డారు. జిల్లాకు సీఎం వంటి వ్యక్తులు వచ్చినప్పుడు ప్రతిపక్ష నాయకులను ఆహ్వానించి అభివృద్ధిపై చర్చించాల్సింది పోయి.. ఎక్కడికక్కడ అరెస్టులు చేయించి పైశాచిక అనందం పొందుతున్నారన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కమీషన్ల కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు బ్రహ్మణ వెల్లంల రిజర్వాయర్ అని పేర్కొన్నారు. అప్పటి సీఎం వైఎస్ఆర్‌ను 450 కోట్లతో ప్రాజెక్టు డిజైన్ చేస్తే.. 35 కోట్ల రూపాయల కమీషన్ తీసుకుని ఉన్న చోటే తవ్వి వదిలేశారని ఆరోపించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక అంచనా వ్యయం 650 కోట్లకు పెంచి ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ట్రయల్ రన్ నిర్వహించారన్నారు. మెడికల్ కళాశాల, యాదాద్రి థర్మల్ ప్లాంట్ కూడా కేసీఆర్ పుణ్యమేనని తెలిపారు.